సాక్షి నిర్మల్


ఆదివారం । 16 । జూలై । 2023

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.4 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, ఉపరితల ద్రోణి ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

కెరమెరి మండలంలోని బాబేఝరి జలపాతం



జల జల.. జలపాతం..

- ఆకర్షిస్తూ.. మదిని దోచేస్తూ
- పర్యాటకుల తాకిడి మరూ
- వాటర్‌ఫాల్స్‌కు కేరాఫ్‌గా ఉమ్మడి ఆదిలాబాద్

అడవుల జిల్లా ఆదిలాబాద్.. ప్రకృతి అందాలకు నెలవు. వానాకాలం వచ్చిందంటే చాలు ఇక్కడ జల సోయగాలు కనువిందు చేసేస్తాయి. కొండకోనల మీదుగా జాలువారే సెలయేళ్లు.. పాలనురుగులా పరవళ్లు తొక్కే జలధారలు ప్రత్యేకం. సహజ సిద్ధ జలపాతాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది ఉమ్మడి జిల్లా. ఇక్కడ పర్యాటకులను ఆకర్షించే కుంటాల.. కనువిందు చేసే పొచ్చర, గాయత్రి, కనకాయి, చింతలమాదర, మిట్టె (సప్తగుండాల), వాస్తాపూర్ స్పెషలాట్రాక్షన్. ప్రస్తుతం వీటికి పర్యాటకుల తాకిడి పెరిగింది. అయితే ఇవి ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఎలా చేరుకోవాలి.. వంటి వివరాలతో సండే స్పెషల్.





జలపాతం వద్ద వనదేవత విగ్రహం

ప్రకృతి ఒడిలో.. పొచ్చర

బోథ్: మండలంలోని పొచ్చర జలపాతానికి మంచి పిక్నిక్ స్పాట్‌గా పేరుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన గంగాదేవి, వన దేవత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణ. వాటర్‌ఫాల్ వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కుటీరాలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి ఊయలలు అందుబాటులో ఉన్నాయి. నేరడిగొండ నుంచి బోథ్ మార్గంలో నాలుగు కిలోమీటర్లు వెళితే బోథ్ ఎక్స్ రోడ్డు వస్తుంది. అక్కడి నుంచి మరో నాలుగు కిలోమీటర్లు వెళితే జలపాతానికి దారి కనిపిస్తుంది. ఇక్కడి వరకు ఆర్టీసీ సదుపాయం ఉంది. అక్కడి నుంచి కిలోమీటర్ వెళితే జలపాతానికి చేరుకోవచ్చు.

కనువిందు చేసే.. గాయత్రి

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామ సమీపంలో రెండు భారీ కొండల మధ్య ఈ జలపాతం ఉంది. దాదాపు 350 అడుగులపై నుంచి జలసోయగం కనువిందు చేస్తోంది. మండలకేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇచ్చోడ వరకు మాత్రమే ఆర్టీసీ సౌకర్యం అందుబాటులో ఉంది. అక్కడి నుంచి మేడిగూడ వరకు 8 కిలోమీటర్ల బీటీరోడ్డు, మరో నాలుగు మీటర్లు మట్టిరోడ్డుపై ప్రైవేట్ వాహనాల్లో చేరుకోవచ్చు.



జలపాతం వద్ద రాత్రి బస చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు.

ఎంతో హాయి.. కనకాయి

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో గల ఈ జలపాతం వర్షాకాలం ప్రారంభం నుంచి ఆరు నెలల పాటు కనువిందు చేస్తుంది. ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ వచ్చే మార్గంలో గిర్నూర్‌కు చేరుకోవాలి. ఇక్కడి వరకు ఆర్టీసీ సదుపాయం ఉంది. అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు వెళితే జలపాతం చేరుకోవచ్చు. సమీపంలోనే బంద్రేవ్ జలపాతం, లోతైన రాతి లోయలు, అతిపురాతన కనకదుర్గ ఆలయం కూడా సందర్శించవచ్చు.



నిర్మల్ జిల్లాలో.. వాస్తాపూర్



నిర్మల్: జిల్లాలో ఏకైక జలపాతం.. వాస్తాపూర్. నిర్మల్ నుంచి మామడ మండలంలోని తాండ్ర గ్రామం మీదుగా వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు. ఎన్.హెచ్.44 బైపాస్ నుంచి కేవలం 5కి.మీ. మాత్రమే. నిర్మల్ నుంచి 20 కి.మీ. వరకు వస్తుంది. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు.



'కుంటాల'కు జలకళ

నేరడిగొండ: రాష్ట్రంలో రెండో ఎత్తైన జలపాతం.. కుంటాల. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి తరలివస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలతో జలకళ సంతరించుకుంది. ఏకో టూరిజం ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేపడుతున్నారు. ఇక్కడ నాలుగు ప్రైవేట్ హోటళ్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరం వెళితే దట్టమైన అటవీ ప్రాంతంలో దర్శనమిస్తోంది. నేరడిగొండ వరకు ఆర్టీసీ సదుపాయం ఉంది. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాలి.



జలధారలతో పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం

రోప్‌వే ఏర్పాటు చేయాలి



కుంటాల జలపాతాన్ని చూసేందుకు కరీంనగర్ నుంచి స్నేహితులతో కలిసి వచ్చాం. వాటర్‌ఫాల్ బాగుంది. అయితే 408 మెట్లు దిగితేనే జలపాతం వీక్షించే అవకాశం ఉంది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు మెట్లు దిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోప్‌వే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పర్యాటకుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది. – పర్యాటకులు, కరీంనగర్

రిసార్ట్ ఏర్పాటు చేయాలి



దూర ప్రాంత పర్యాటకుల సౌకర్యార్థం కుంటాల జలపాతం వద్ద హరిత హోటల్స్, రిసార్ట్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. జలపాతం విశిష్టతను తెలిపేలా గైడ్‌లను నియమిస్తే ప్రమాదాలు సైతం చోటు చేసుకునే అవకాశం ఉండదు. – పర్యాటకులు, హైదరాబాద్

ప్రకృతి అందాలు బాగున్నాయి



పొచ్చర వద్ద ప్రకృతి అందాలు బాగున్నాయి. నీటి పరవళ్ల శబ్దాలు వినసొంపుగా ఉన్నాయి. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన కుటీరాలు బాగున్నాయి. కుటుంబంతో వచ్చి చూడాల్సిన ప్రాంతం ఇది. – ఉమాచరణ్, బాసర

అవగాహన కల్పిస్తున్నాం



చింతలమాదర జలపాతం వద్దకు చాలా మంది పర్యాటకులు వస్తుంటారు. వారికి జలపాతం వివరాలు తెలియజేస్తా. ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పిస్తా. గతంలో ఇక్కడ నీట మునిగి పలువురు మృత్యువాత పడిన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉంటాం. – చిత్రం శంకర్, చింతలమాదర, తిర్యాణి

● 'మిట్టె' సవ్వడులు



చింతలమానెపల్లి: లింగాపూర్ మండలం పిట్టగూడ సమీపంలో ఈ జలపాతం ఉంది. ఒకే ప్రవాహంపై ఒకదాని తర్వాత మరొకటి ఏడు జలపాతాలు ఉండడంతో సప్తగుండాల అని కూడా పిలుస్తారు. లింగాపూర్ నుంచి కాలినడకన రెండు కిలోమీటర్లు వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు.

● మదిని దోచే.. 'చింతలమాదర'



తిర్యాణి మండలం మంద గూడ గ్రామ పంచాయతీలోని చింతల మాదర సమీపంలో ఉంది. తిర్యాణి మండల కేంద్రం నుంచి 16 కి.మీ.లు ప్రైవేట్ వాహనాల్లో వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు.

● జాలువారే 'గుండాల'



తిర్యాణి మండలం గుండాల గ్రామ పంచాయతీలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. 50 అడుగుల కొండవాలు నుంచి జాలువారుతోంది. తిర్యాణి నుంచి 10 కి.మీ.ల దూరంలో గల రొంపల్లి వరకు వాహనాల్లో వెళ్లొచ్చు. తర్వాత దట్టమైన అడవిలో ఆరు కి.మీ.లు కాలినడకన వెళ్లాలి.

● వంద అడుగుల 'కొండెంగలొద్ది'



పెంచికల్‌పేట్ మండలం అగర్ గూడ అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. దాదాపు వంద అడుగుల ఎత్తునుంచి దూకే జలధార ఇది. పెంచికల్ పేట్ నుంచి అగర్‌గూడకు 7 కి.మీ.లు వాహనంలో వెళ్లి, మరో ఐదు కి.మీ.లు నడవాలి.

● రెండు ధారల 'ఉల్లిపిట్ట'



తిర్యాణి మండలం ఉల్లిపిట్ట గ్రామ పంచాయతీలో ఈ జలపాతం ఉంది. మండల కేంద్రం నుంచి వాహనాల ద్వారా 20 కిలోమీటర్లు వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు. 20 అడుగుల నుంచి పడే రెండు ధారలు ఆకట్టుకుంటున్నాయి.

కుమురంభీం జిల్లాలో మరిన్ని..



కుండై జలపాతం

కెరమెరిలో 'బాబేఝరి', చింతలమానెపల్లిలోని శివపెల్లి, సిర్పూర్(యూ) మండలంలోని బాండేయేర్ అటవీప్రాంతంలో గల కుండై, కాగజ్‌నగర్ మండలంలోని ఊట్‌పల్లి, దరిగాం అటవీప్రాంతంలో దరిగాం, పెంచికల్‌పేట్ మండలం గుండపెల్లి అటవీ ప్రాంతంలో గల దుద్దులాయి జలపాతం కుమురంభీం జిల్లాలో ఉన్నాయి.

న్యూస్‌రీల్

డీఎస్పీకి సన్మానం



డీఎస్పీకి మొక్క అందజేస్తున్న రాంచందర్

నిర్మల్‌టౌన్: నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గంగారెడ్డిని జిల్లా కేంద్రంలోని ఎస్డీపీవో కార్యాలయంలో పలువురు శనివారం సన్మానించారు. జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్ పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షుడు లక్ష్మణచారి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఆకోజీకిషన్, కూన రాజేశ్వర్, ఏఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

న్యూవెల్మల్ పాఠశాలను సందర్శించిన ఐడీసీ చైర్మన్



విద్యార్థులతో మాట్లాడుతున్న వేణుగోపాలచారి

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలను టీఎస్ ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా అని అడిగారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన 3 ఎల్‌ఈడీ టీవీలను, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలని సర్పంచ్‌కు సూచించారు. బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు విన్నవించారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వరమి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పకడ్బందీగా నులిపురుగుల నివారణ దినం

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయ నులిపురుగుల నివారణ దినం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. రక్తహీనత, పోషకాహార లోపం తదితర సమస్యలతో చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా ప్రభుత్వం జాతీయ నులిపురుగు నివారణ దినం నిర్వహిస్తుందని తెలిపారు. ఈనెల 20న జిల్లాలోని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండాజోల్ మాత్రలు డాక్టర్ల సలహా మేరకు అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలల్లో పంపిణీ చేయాలన్నారు. 1 నుంచి 5 ఏళ్లలోపు అంగన్వాడీ కేంద్రాల్లో 53,688 మంది చిన్నారులకు, జిల్లా వ్యాప్తంగా 1,91,793 మంది పిల్లలకు ఈ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆశ, అంగన్వాడీ, పాఠశాలల, కళాశాలల, సంబంధిత శాఖల సంక్షేమ అధికారులు, మున్సిపల్, పంచాయతీ, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధుల, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 20న అల్బెండాజోల్ మాత్ర వేసుకోనివారు 27న తప్పనిసరిగా వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని 1–2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను, 2–3 సంవత్సరాల చిన్నారులకు పూర్తి మాత్రను, 3–19 ఏళ్ల వారికి పూర్తి మాత్ర మింగేలా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు వైద్యాధికారి డాక్టర్ రఘు కార్యక్రమం నిర్వహణ గురించి వివరించారు. సమావేశంలో డీఆర్వో లోకేశ్, డీఎంహెచ్‌వో ధనరాజ్, సీపీవో సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, డీపీఆర్వో తిరుమల, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు ఎస్సైల బదిలీ

నిర్మల్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల ప్రక్రియ మొదలైంది. పోలీస్ శాఖ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ బాసర జోన్ –2సర్కిల్ డీఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 11 మంది ఎస్సైలుజిల్లా నుండి బదిలీ అయ్యారు. జిల్లాకు కొత్తగా 16 మంది బదిలీపై రానున్నారు. వీరికి స్థానాలు కేటాయించలేదు.

బదిలీపై జిల్లాకు వచ్చేవారు

పేరు	ప్రస్తుత పోస్టింగ్
ఎ.పూర్ణేశ్వర్	నిజామాబాద్–టౌన్‌వన్
సాయికుమార్	నిజామాబాద్ టౌన్‌వన్
లింబాద్రి	నిజామాబాద్ రూరల్
కచ్చకాయల గణేశ్	డిచ్‌పల్లి
శ్రీకాంత్ కుంట	జక్రన్‌పల్లి
నరేశ్ బరుకుంట	ఇందల్వాయి
చంద్రమోహన్	బాల్కొండ
శ్రీకాంత్	నందిపేట్
కె.రాజు	యేరుగట్ల
పి.అమాస్	సీసీఎస్, నిజామాబాద్
టి. మోహన్‌రావు	వీఆర్ నిజామాబాద్
గయాన్ సింగ్	వీఆర్ నిజామాబాద్
రాజేశ్వర్‌గౌడ్	ట్రాఫిక్ పీఎస్, నిజామాబాద్
జి.చంద్రయ్య	వీఆర్ నిజామాబాద్
ఎస్.అన్వర్	డీఎస్బీ ఆదిలాబాద్
జి.అశోక్	వీఆర్, ఆదిలాబాద్

జిల్లా నుంచి బదిలీ అయినవారు

జి.అశోక్	మమాడ
విక్రమ్ భూపల్లి	తానూర్
మహేశ్	బాసర
మహేశ్ సిలివేరి	డీఎస్బీ, నిర్మల్
సక్రియ నాయక్	డీఎస్బీ, నిర్మల్, అటాచ్డ్ డిస్ట్రిక్ కోర్టు
మహేందర్	నిర్మల్‌టౌన్
సాదిక్ హుస్సేన్	పీసీఆర్, నిర్మల్
గణేశ్	సీసీఎస్, నిర్మల్
శ్రీనివాస్‌రావు	డీఎస్బీ, నిర్మల్
గంగాధర్	వీఆర్, నిర్మల్

పోలీసులకు అవగాహన సదస్సు



సదస్సులో ఏఎస్పీ కాంతిలాల్, పోలీసు అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో జిల్లా పోలీస్ శాఖ అధికారులకు ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంధ్య, సంతోష్ మాట్లాడుతూ... మనిషి జీవితంలో ఒత్తిళ్లను ఎదుర్కొని, ఆనందంగా ఎలా ఉండాలో వివరించారు. మనిషికి నిత్యజీవితంలో ఎన్ని అలజడులు ఎదురైనా సంతోషంగా గడపాలని సూచించారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని 350 మంది పోలీసు అధికారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్‌బీఐ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నిర్మల్ పట్టణ, రూరల్ సీఐలు పురుషోత్తం, శ్రీనివాస్, సోన్ సీఐ నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది, మహిళా సిబ్బంది, హోమ్ గార్డులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఆర్డీవో విజయలక్ష్మి



సమావేశంలో డీఆర్డీవో, అధికారులు

సోన్: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో విజయలక్ష్మి హెచ్చరించారు. ఉపాధి హామీ పథకంలో గడిచిన మూడేళ్లలో మండలంలో చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. డీఆర్డీవో అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఇప్పటి వరకు చేసిన పని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాఫ్రపూర్ గ్రామంలో హరితహారంలో పెట్టిన మొక్కలు వరదలకు కొట్టుకు పోయాయని తెలిపారు. సిద్దులకుంటలో పెట్టిన మొక్కలు అధికంగా ఎండిపోయాయని చెప్పారు. కొందరు రైతులు ఉపాధిహామీలో చేసిన పని ప్రదేశాన్ని పూడ్చి చదును చేశారని పేర్కొన్నారు. కొంత మంది రైతులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని తెలిపారు. పని ప్రదేశంలో పని వ్యయం తెలిపే సూచికలు ఏర్పాటు చేయలేదన్నారు. పని దినాలు పూర్తయ్యాక హాజరు వేశారని గుర్తించారు. ఎంపీపీ మనస మాట్లాడుతూ తనకు తెలియకుండానే తన కార్యలయంలో ఇతర ప్రాంతాల వ్యక్తుల పేరిట పశువుల తొట్టికి సంబంధించి బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. రికవరీ రూ.47,161, జరిమానా రూ.17 వేలు విధిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో వచ్చిన ఫిర్యాదులపై వారం రోజుల్లో విచారణ జరిపి, పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మానస, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఏపీడీ ఓన ప్రసాద్, ఎంపీవో ఖలీల్ హైమద్, ఏపీవో మంజులరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెన్షన్ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు, నాయకులు

నిర్మల్ రూరల్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణే లక్ష్యంగా టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర శాఖ చేపట్టిన పాత పెన్షన్ సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని అధ్యక్షుడు కృష్ణారావు కోరారు. జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో సీపీఎస్ ఉద్యోగుల సమావేశం శనివారం నిర్వహించారు.అనేక పోరాటాలు చేసి గ్రాట్యుటీ, కుటుంబ పెన్షన్ సాధించుకున్నామని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోరాటం చేసి పాత పెన్షన్ సాధిద్దామన్నారు. అనంతరం రథయాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, చక్కర శ్రీనివాస్, చుక్క సాయికృష్ణ, సూపరింటెంట్ మోహన్‌రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

'ఎంపీపై విమర్శలు మానుకోవాలి'

ఖానాపూర్: తుడుందెబ్బ తీసుకునే నిర్ణయాలకు, ఈనెల 23న హైదరాబాద్‌లో జరిగే తుడుందెబ్బ రాష్ట్రస్థాయి సమావేశానికి ఆదిలాబాద్ ఎంపీకి ఎటువంటి సంబంధం లేదని తుడుందెబ్బ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ మాధవ్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లోని కొంత మంది బీఆర్ఎస్‌కు చెందిన ఆదివాసీ నాయకులు పదేపదే ఎంపీ సోయంబాపురావును విమర్శించడం మానుకోవాలని సూచించారు. 23న జరిగే సమావేశానికి ఆదివాసీలు తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న ఆస్పత్రి సిబ్బంది



నగదును అందిస్తున్న సెక్యూరిటీ గార్డు లక్ష్మి

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కుభీర్ మండలం నిగ్వా గ్రామానికి అమృత తన భర్త సాయికిరణ్‌తో కలిసి భైంసాలోని ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు శనివారం వచ్చారు. అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో తన వెంట తెచ్చుకున్న రూ.13వేల నగదును ఆస్పత్రి ఆవరణలో పోగొట్టుకుంది. దీంతో ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది లక్ష్మికి నగదు లభించగా నర్సు సునీత సహాయంతో వారి వివరాలు తెలుసుకుని అప్పగించింది. దీంతో లక్ష్మి నిజాయితీకి ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, సిబ్బందితోపాటు పలువురు అభినందించారు.

తిరుపతిలో తప్పిపోయిన గొడ్సరవాసి



దత్తాహరి (ఫైల్)

కుభీర్: మండలంలోని గొడ్సర గ్రామానికి చెందిన దత్తాహరి, బాబు, కస్రా గ్రామానికి చెందిన బండు ముగ్గురు కలిసి ఈ నెల 7న తిరుపతికి బయలుదేరారు. దర్శనం తరువాత 10వ తేదీన తిరుగు ప్రయాణమయ్యారు. తిరుగు ప్రయాణంలో దత్తాహరి అనే వ్యక్తి అనంతపురం జిల్లా ధర్మవరం స్టేషన్‌లో తప్పిపోయినట్లు గొడ్సర గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... దత్తాహరికి తెల్ల కల్లు గాగే అలవా టు ఉంది. రైలులో వచ్చే సమయంలో కల్లు తాగకపోవడంతో వాంతులు చేసుకున్నాడు. దీంతో ధర్మవరం స్టేషన్‌లో శుభ్రం చేసుకునేందుకు రైలు దిగాడు. ఆ సమయంలో రైలు వెళ్లి పోవడంతో తోటి వ్యక్తులకు ఫోన్ చేసి మరో రైలులో వస్తానని చెప్పాడు. మద్యం తాగి రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా అక్కడి పోలీసులు గుర్తించి ఈ నెల 12న జహీరాబాద్ వైపు వచ్చే రైలు ఎక్కించారు. నేటికి ఆచూకీ కానరాలేదు. కు టుంబీకులు శనివారం అతడిని వెతికేందుకు వెళ్లారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరి హోంనగర్‌కు చెందిన యువతి శనివారం అదృశ్యమైనట్లు ఎస్సై ఇసాక్ అలీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హరి హోం నగర్‌లో నివాసం ఉంటున్న యువతి సోదరుడు కార్తీక్ ఉదయం 7గంటల ప్రాంతంలో పని నిమిత్తం బయటకు వెళ్లాడు. అనంతరం యువతి తల్లి ఇతరుల ఇంటికి వెళ్లింది. కొంతసేపటికి తల్లి ఇంటికి తిరిగి వచ్చేసారికి యువతి ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం గాలించిన్నప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇంద్రనగర్‌కు చెందిన సయ్యద్ బిక్కన్ (46) అదృశ్యమైనట్లు ఆదిలాబాద్ టూ టౌన్ ఎస్సై ఊషన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంద్రనగర్‌కు చెందిన బిక్కన్ శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో కారు పెట్టానని, దానిని తీసుకెళ్లమని అతడి సోదరుడు సయ్యద్ మగ్దుంకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ఫోన్ కనెక్ట్ కాకపోవడంతో బిక్కన్ సోదరుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతలు స్వీకరించని ఎస్జీటీలు

- డిప్యూటీ వార్డెన్‌గా విధులు నిర్వర్తించేందుకు ముందుకు రాని ఎస్జీటీలు
- హెచ్‌ఎంలపై అదనపు భారం పడుతున్న వైనం
- బాలికల ఆశ్రమ పాఠశాలలో పురుష హెచ్‌ఎంల పర్యవేక్షణ
- అదనపు బాధ్యతతో కొరవడుతున్న పర్యవేక్షణ



వసతి గృహంలో భోజనం తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల పర్యవేక్షణ కోసం సర్వసాధారణంగా డిప్యూటీ వార్డెన్‌లు, హెచ్‌డబ్ల్యూవోలు ఉంటారు. జిల్లాలో కొన్ని ఆశ్రమ పాఠశాలలో అక్కడే నివాసం ఉంటూ అక్కడే చదువుకునే ఆశ్రమ పాఠశాలలో ఆ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడిని డిప్యూటీ వార్డెన్‌గా నియమిస్తారు. ఆశ్రమ పాఠశాలలో ఉంటూ మరోచోట చదువుకునే వసతి గృహాల్లో హెచ్‌డబ్ల్యూవోలను నియమిస్తారు. కానీ చాలా వసతి గృహాల్లో కొన్నేళ్లుగా డిప్యూటీ వార్డెన్‌లుగా బాధ్యతలు స్వీకరించడానికి ఎస్జీటీలు ముందుకు రావడం లేదు. అలాగే జిల్లాలోని చాలా ఆశ్రమ పాఠశాలలో హెచ్‌డబ్ల్యూవోల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 54 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా ఇందులో 33 బాలుర వసతి గృహాలు ఉన్నాయి. అందులో 8,526 మంది విద్యార్థులు ఉన్నారు. 21 బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉండగా ఇందులో 6,754 మంది విద్యార్థులు ఆయా ఆశ్రమ పాఠశాలలో ఉంటూ ఈ విద్యా సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో పురుష ఉపాధ్యాయులే పర్యవేక్షణ

సర్వసాధారణంగా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రాత్రి వేళలో బాలికల పర్యవేక్షణకు మహిళ వార్డెన్ ఉండాలి. మహిళ వార్డెన్‌లు లేక జిల్లాలో పలు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పురుష హెచ్‌ఎంలే అక్కడ రాత్రి వేళలో నివాసం ఉంటూ పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. బాలికల పర్యవేక్షణ కోసం మహిళ వార్డెన్, డిప్యూటీ వార్డెన్‌లు లేక అత్యవసర సమయంలో వారి బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని పలువురు బాలికలు పేర్కొంటున్నారు.

హెచ్‌ఎంలపై అదనపు భారం

జిల్లాలోని చాలా గిరిజన ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్‌లు లేరు. ఆయా ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు అదనపు బాధ్యతలను నిర్వర్తించడంతో సంబంధిత సబ్జెక్టు బోధించే హెచ్‌ఎంలు విద్యార్థులకు బోధన చేయలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు చదువుల పరంగా నష్టపోతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో 9 హెచ్‌డబ్ల్యూవో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే 90 శాతానికిపైగా ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్‌లు లేరు.

ముందుకు రాని ఎస్జీటీలు

ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్, హెచ్‌డబ్ల్యూవోలు విద్యార్థుల భోజనం కోసం కూరగాయలు, వంట గ్యాస్ వంటి కొనుగోలు కోసం ముందుగా డబ్బులు పెట్టుబడి పెట్టుకోవాలి. ఆ బిల్లులు సకాలంలో అందకపోవడంతో డిప్యూటీ వార్డెన్, హెచ్‌డబ్ల్యూవో బాధ్యతలు తీసుకున్నేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో అదనపు బాధ్యతలు మోస్తున్న హెచ్‌ఎంలపై పని ఒత్తిడి కారణంగా పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో వారు ఏ వృత్తికి న్యాయం చేయకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిప్యూటీ వార్డెన్‌తో పాటు హెచ్‌డబ్ల్యూవోలను నియమించాలని విద్యార్థినిల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

మహిళ వార్డెన్‌లు ఉండేలా చర్యలు



ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్, హెచ్‌డబ్ల్యూవోలు ఉండేలా చూసుకుంటున్నాం. ప్రధానంగా బాలికల ఆశ్రమ పాఠశాలలో రాత్రి వేళలో పురుష వార్డెన్‌లు ఉండడానికి వీలు లేదు. మహిళ వార్డెన్‌లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పురుష వార్డెన్‌లు ఉంటే వారిని తొలగించి, మహిళ వార్డెన్లను నియమిస్తాం.

– చాహత్ బాజ్ పాయ్, పీవో, ఐటీడీఏ ఉట్నూర్

రిమ్స్‌లో మరిన్ని వైద్య సేవలు



బీపీ పరీక్షలు చేయించుకుంటున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా రిమ్స్ ఆస్పత్రిలో మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. రిమ్స్ ఓపీ విభాగంలో రూ. 2.5లక్షలతో వృద్ధులకు ఫిజియోథెరపీ కేంద్రం, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ, చికిత్స కేంద్రం ఏర్పాటు చేయగా, సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో మానసిక రోగుల కౌన్సెలింగ్, చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీటిని శనివారం ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వైద్య చికిత్సల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా అన్ని రకాల సౌకర్యాలను సర్కారు దవఖానాల్లోనే అందుబాటులోకి తెస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, డీఎంవో శ్రీధర్, వైద్యులు తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఎయిడ్స్ కేంద్రాల మూత

- ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఐదు ఐసీటీసీ కేంద్రాలు
- హేతుబద్ధీకరణ పేరుతో కేంద్రం నిర్ణయం
- రోడ్డున పడనున్న ఉద్యోగులు
- ఆందోళనలో హెచ్‌ఐవీ బాధితులు



మూసివేయనున్న చెన్నూర్ ఐసీటీసీ కేంద్రం

చెన్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలు మూతపడనున్నాయి. హేతుబద్ధీకరణ పేరుతో ఆ కేంద్రాలను మూసివేయాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని మొదటి దశ ఐదు ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ ట్రైనింగ్ సెంటర్ (ఐసీటీసీ) కేంద్రాలు మూతపడనున్నాయి. ఐసీటీసీ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు రోడ్డునపడే అవకాశాలు ఉన్నాయి. ఐసీటీసీ కేంద్రాలు లేకపోతే మా పరిస్థితి ఏమిటని హెచ్‌ఐవీ బాధితులు ఆందోళన చెందుతున్నారు.

మూతపడనున్న కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలో 17 ఐసీటీసీ కేంద్రాలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు జిల్లా ఆస్పత్రి కేంద్రాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాలలో హెచ్‌ఐవీ బాధితులు 16220 మంది ఉన్నారు. హేతుబద్ధీకణ పేరుతో జిల్లాలోని ఐదు కేంద్రాలకు తాళం పడనుంది. ఇందులో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 1, నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, ముథోల్, మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, మందమర్రి కేంద్రాలను ఎత్తివేయనున్నారు. మూసివేసే ఐదు ఐసీటీసీ కేంద్రాల పరిధిలో 4500 మంది హెచ్‌ఐవీ బాధితులున్నారు. ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలు మూసివేయడంతో పరీక్షలతో పాటు హెచ్‌ఐవీ సోకిన బాధితులకు మందుల పంపిణీకి చెక్‌పడనుంది. దీంతో హెచ్‌ఐవీ బాధితులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో హెచ్‌ఐవీ బాధితులకు నష్టం జరిగే అవకాశాలున్నాయి.

ఐసీటీసీ కేంద్రాలు 2004లో ప్రారంభించింది..

కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ నియంత్రణ కోసం జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని 2004లో ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఐసీటీసీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించడం హెచ్‌ఐవీ బాధితులకు ఎయిడ్స్‌పై కౌన్సెలింగ్ ఇప్పించడం, భార్యాభర్తలకు వ్యాధిపై అవగాహన కల్పించడం, వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడం, అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా హెచ్‌ఐవీ పట్ల అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు.

నేషనలైజేషన్ పేరుతో...

నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ తరపున అన్ని జిల్లాలకు ఒక లేఖ రాసింది. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న పరీక్షలు, వ్యాధి తీవ్రత, బాధితులు ఎంతమంది అనే విషయాలను ఇవ్వాలని కోరింది. జిల్లాల నుంచి వెళ్లి సమాచారాన్ని సేకరించి కేంద్రాన్ని పంపించింది. మూడేళ్లుగా తక్కువ పనితీరు ఉన్న కేంద్రాలను మూసివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఐసీటీసీ కేంద్రాలలో ఒక్క కౌన్సెలర్‌తో పాటు ఎల్‌టీ, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటారు. ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో ఐదు కేంద్రాలను మూతపడనున్నాయి. పది మందికి పైగా ఉద్యోగులకు రోడ్డున పడనున్నారు. హెచ్‌ఐవీ కేసులు తక్కువగా ఉన్నాయని కేంద్రాలను మూసివేయడం సరికాదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఓ వైపు హెచ్‌ఐవీ విస్తరిస్తుంటే మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఐసీటీసీ కేంద్రాలను మూసే వేయాలని నిర్ణయించడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు.

పొంగిన వాగు..



ఉధృతంగా ప్రవహిస్తున్న లొద్దిలవాగు

కడెం: మండలంలోని గంగాపూర్, రానిగూడ, కొర్రతండా గ్రామ పంచాయతీ వాసులకు వానాకాలం కష్టాలు మొదలయ్యాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామానికి వెళ్లే మార్గంలోనే వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లొద్దిల వాగుపై ఇటీవల నిర్మించిన రొడ్యాం (సీసీ) కొంత మేర కొట్టుకుపోయింది.

తిరుగు ప్రయాణంలో ఎడారి ఓడలు



ఒంటెలతో తిరిగివెళ్తున్న పశువుల కాపరి

తాంసి: ప్రతీ ఏటా వేసవికాలంలో రాజస్థాన్‌కు చెందిన పశువుల కాపరులు తమ ఏడారి ఓడలైనా ఒంటెలతో జిల్లాకు వలస వస్తుంటారు. జిల్లాలో పంటచేలలో పశుగ్రాసం కోసం తిప్పుతూ ఉపాధి పొందుతుంటారు. ప్రస్తుతం వర్షాలు కురియడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న రాజస్థాన్‌కు చెందిన కాపరులు తిరిగి తమ రాష్ట్రానికి వెళ్తున్నారు. శనివారం తాంసి మండలంలోని వడ్డాడి వద్ద రాజస్థాన్‌కు చెందిన కాపరి ఒంటెలతో వెళ్తుండగా సాక్షి క్లిక్ మనిపించింది.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీలో మట్కా నిర్వహిస్తున్న పలువురిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై ఊషన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం... వడ్డెర కాలనీలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పలువురు మట్కా నిర్వహిస్తూ కనిపించారు. వారి వద్ద నుంచి రూ.9వేల నగదు, మూడు సెల్ ఫోన్‌లు, మ ట్కా చిటీలు స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురికి గాయాలు..

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. భైంసాలోని భట్టిగల్లికి చెందిన విఠల్, వానల్‌పాడ్‌కు చెందిన మహిపాల్ శనివారం సాయంత్రం బైక్‌పై భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా, బిహార్‌కు చెందిన హమాలీలు సుందల్, దశరథ్ బైక్‌పై వెనుకవైపు నుంచి వచ్చి ఢీకొన్నారు. సుందల్‌కు తీవ్రగాయాలు కాగా, దశరథ్, విఠల్, మహిపాల్‌కు గాయాలపాలయ్యారు. వారిని ఏరియాస్పత్రికి తరలించారు. సుందల్‌ను నిజామాబాద్‌కు తరలించారు.

కొడప నగేశ్‌ను తుడుందెబ్బ నుంచి బహిష్కరించాం

- ఎంపీ సోయం బాపూరావ్ లక్ష్యాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు
- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పొచ్చయ్య



సమావేశంలో పాల్గొన్న తుడుం దెబ్బ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: కొడప నగేశ్‌ను ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కమిటీ నుంచి బహిష్కరించామని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పొచ్చయ్య అన్నారు. తుడుం దెబ్బతో కొడప నగేశ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగేశ్‌కు రాష్ట్ర కమిటీ నాయకత్వంలో ఎలాంటి హోదా లేదన్నారు. తుడుం దెబ్బకు వ్యతిరేకంగా ప్రకటన చేస్తూ విచ్చినం చేసే కుట్రలు పన్నారని విమర్శించారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. మరికొంత మంది తుడుం దెబ్బలో ఉంటూ ఎంపీ సోయం బాపూరావ్ కనుసన్నల్లో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సోయం బాపూరావు ఎంపీ అయిన తరువాత తుడుం దెబ్బ లక్ష్యాలకు విరుద్ధంగా 170 చట్టాన్ని సవరించాలని పార్లమెంట్‌లో ఆదివాసీల మనోభావాలకు విరుద్ధంగా ప్రసంగించారన్నారు. లంబాడీల సమావేశంలో లంబాడీలు ఎస్టీలే, నేను ఆదివాసీ పులి రాథోడ్ రమేశ్ లంబాడి పులి బిడ్డనని వారిని ఎస్టీ జాబితా నుంచి తీయడం జరగదని వ్యాఖ్యానించారని తెలిపారు. బాపూరావ్ ఎన్ని కుట్రలు పన్నినా తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ నిర్మాణాత్మకంగా ఎదుర్కొంటుందన్నారు. ఎంపీ సోయం చేసే కుట్రలను గుర్తించి దశల వారీగా చర్యలు తీసుకుంటామన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్, కార్యదర్శి ఉయిక సంజీవ్, సిద్దబోయిన లక్ష్మినారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణేష్ ఉన్నారు.

అంద్ సమాజ్ అభివృద్ధికి కృషి చేయాలి



పీవోను సన్మానిస్తున్న ఆదివాసీ సమాజ్ పెద్దలు

ఇంద్రవెల్లి: ఆదివాసీ సమాజంలో అంద్ ఆదివాసీ గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అంద్ ఆదివాసీ గ్రామల అభివృద్ధికి కృషి చేయాలని అంద్ ఆదివాసీ సేవ సంఘం జిల్లా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఇంగ్లే కేశావ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరత్ గారులే, జిల్లా అధ్యక్షులు ముఖడే విష్ణులు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు విన్నవించారు. శనివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయాన్ని సందర్శించి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు శాలువలతో సన్మానం చేసి అంద్ ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, విద్యా, ఆర్యోగ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంద్ ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. అనేక మంది నిరుద్యోగులు బీఎడ్, డీఎడ్ చదువులు పూర్తి చేసి టెట్‌లో కూడా అర్హత సాధించి ఉద్యోగాలు రాక ఇళ్లల్లో ఉంటూ వ్యవసాయ పనులు చేస్తున్నారని, ఐటీడీఏ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్న సీఆర్‌టీ పోస్టులను అంద్ ఆదివాసీ నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంద్ ఆదివాసీ సేవ సంఘం నాయకులు మార్కెడ్ లక్ష్మణ్, పర్సురాం, గజానంద్, గోద్‌మల్లె శంకర్ ఉన్నారు.

తెగిన తాత్కాలిక వంతెన..

- నిలిచిన రాకపోకలు
- ఇబ్బందుల్లో ప్రజలు



తెగిపోయిన తాత్కాలిక వంతెన

జైనథ్: మండలంలోని తరోడ గ్రామం వద్ద సాత్నాల వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన తెగిపోయింది. జాతీయ రహదారిపై ఉన్న పాత బ్రిడ్జి మార్చి నెలలో కుంగిపోవడంతో వాగు మీదుగా తాత్కాలికంగా వంతెన నిర్మించారు. అయితే అప్పటి నుంచి ప్రధాన బ్రిడ్జి మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ రహదారి విస్తరణ పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉండడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వాగుపై తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తాత్కాలిక బ్రిడ్జిపైనే రాకపోకలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం కురిసిన వర్షాలకు ఈ తాత్కాలిక వంతెన తెగిపోయింది. దీంతో బేల, జైనథ్, ఆదిలాబాద్‌ను మహారాష్ట్రతో కలిపే జాతీయ రహదారి గుండా రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ రోజు వందలాది వాహనాలు, ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం వంతెన తెగిపోవడంతో నిరాల గుండా అడ, లాండ సాంగ్వి గ్రామాల మీదుగా ఉన్న సింగిల్ రోడ్డును ప్రజలు వినియోగిస్తున్నారు. ఇది సింగిల్ రోడ్డు కావడం, ఇరుపక్కల చెట్లతో ఇరుకుగా ఉండడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణాలు చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. త్వరగా బ్రిడ్జిని పునరుద్ధరించి రాకపోకలకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ప్రాణం తీసిన అన్నదమ్ముల గొడవ




ప్రశాంత్(ఫైల్)



కందుకూరి ప్రశాంత్ మృతదేహం

నేరడిగొండ: అన్నదమ్ములు గొడవపడుతుండగా అడ్డుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు గాయాలపాలై మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండలంలోని వడూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... చింటూ, పవన్ అన్నదమ్ములు ఇంటి వద్ద గొడవ దిగారు. అదే గ్రామానికి చెందిన కందుకూరి ప్రశాంత్ (21) వారిని సముదాయించి, గొడవ పడకుండా నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగా వారి తోపులాటలో ప్రశాంత్ కిందపడిపోయాడు. దీంతో తలకు గాయం కావడంతో తీవ్ర రక్త స్రావమైంది. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కి తరలించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



పంద్ర జైతు మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని టక్కుగూడ గ్రామానికి చెందిన రైతు పంద్ర జైతు (24) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఎస్సై భరత్‌సుమన్ వివరాల ప్రకారం.. టక్కుగూడకు చెందిన మాన్కు కుమారుడు పంద్ర జైతు తనకున్న పంట పొలంలో మోటారు ద్వారా పంటకు నీరందించే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు జైతును ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ జైవంత్‌రావు, లింగోజితాండ సర్పంచ్ హరినాయక్‌లు ఆసుపత్రికి చేరుకొని సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

పత్తి రైతు ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

పెంబి: పత్తి విత్తనాలు మొలకెత్తలేవని రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెంబి మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రజనీకాంత్ వివరాల ప్రకారం... మండలంలోని లోతర్యతండా గ్రామానికి చెందిన గుగ్లావత్ అశోక్ (37) తనకున్న మూడెకరాలతో పాటు కౌలుకు తీసుకున్న మూడెకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో అప్పుగా తీసుకువచ్చిన పెట్టుబడి ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులోనే శనివారం ఉదయం ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

ఇంటింటా చెత్త సేకరణలో సర్పంచ్

పెంబి: పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. దీంతో పెంబి మండల కేంద్రంలో సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటా చెత్త సేకరిస్తున్నారు. శనివారం చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తుండగా బస్టాండ్ వద్ద పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. తమ సమ్మెకు సహకరించాలని కోరారు. వ్యాధులు ప్రబలుతాయని ఎంపీవో రత్నాకర్‌రావు కార్మికులకు నచ్చజెప్పి ట్రాక్టర్‌ని డంపింగ్ యార్డుకు తరలించారు.



జీపీ ట్రాక్టర్‌ని అడ్డుకుంటున్న కార్మికులు



డంపింగ్ యార్డుకు తరలిస్తున్న సర్పంచ్, ఎంపీవో